పంచపాత్ర

కే ఎ స్వీ

4

(గతసంచిక తరువాయి)

ఎదురు చూడని మలుపేంకాకపోయినా-మలుపు మలుపే!

ఆలోచిస్తున్నాను నేను.

కైక కథలో కొత్తదనం ఏమీలేదు. కథలో లేకపోతేనేం?— కథనం లో కొత్తదనం తీసుకురావొచ్చుగా!? ఏమో! ఆ నమ్మకం కూడా లేదు. కైక కథని కైక చెప్పినదానికంటే మెరుగ్గా నేను చెప్పలేను.

అదీగాక - ఇంకో ముఖ్యమైన విషయముంది—

"ఏమిటాలోచిస్తున్నారు? నాకథ నవలగా రాసెయ్యండి — మీకు మంచి పేరొస్తుంది, స్త్రీ పాఠకులు మిమ్మల్ని మెచ్చుకుంటారు" అంది కైక.

సరీగ్గా అదే పాయింటు నేను ఆలోచిస్తున్నదికూడా.

"వూహూం-" అన్నాను. "లేదు, కథ మీరు చెప్పినట్టు గనక రాస్తే-స్త్రీపాఠకులకి నేను చెడ్డయిపోతాను. కట్నం ఏగెయ్యడానికి కైక తండ్రి ప్రయోగించిన లౌక్యప్రజ్ఞ ఈప్రేమకథ (?) లో చాలా ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. కైకనుగురించి నా అనుమానాలు నాకున్నాయి. గోపీసుందరాన్నిగానీ, యస్. గోపాలాన్నిగానీ ఆమె ప్రేమించినట్టు కనిపించదు. కనీసం అలా నటించనుకూడా నటించదు! తండ్రి పథకానికి సరిపడేంతగా ఆమె నటించగలిగిందేమో గాని, ఆ నటనలో కొంచెం సిన్సియారిటీని రంగరించివుంటే—ఆమె గోపీ సుందరాన్నో, యస్. గోపాలాన్నో తప్పకుండా దక్కించుకునే వుండేది—"

మూతి ముడుచుకుంది కైక - "తప్పంతా కైకదేనంటారా?"—

"అనను. అసలు తప్పు ఎవ్వరిదీకాదేమో! అందరూ స్వార్థం చూసుకున్నవాళ్ళే! స్వంతలాభం కొంత మానమన్నారు, అంతా మానమనలేదు. కైక ఎవ్వర్నీ నిందించకూడదు. కైకనూ ఎవ్వరూ నిందించకూడదు ఈ కథలో విలన్ ఎవరంటే - సమాజం. సమాజం అల్లిన ఆర్థిక విషవలయం—"

కళ్ళలో వింత వెలుగుతో నవ్వింది కైక - "అవును, కైక కథలో విలన్ సాంఘిక దురన్యాయమే! వరకట్నం అనే పెనుభూతం నీడ కైక జీవితంమీదపడింది. కైకతండ్రి కట్నం ఇవ్వలేదు. గోపీసుందరం—వొచ్చే చక్కటి కట్నాన్ని పోగొట్టుకుని కైకను చేసుకోలేదు. కట్నం లేకుండా మంచి మొగుణ్ణి కొట్టేసిన చెల్లెల్నిచూసి కైక జెలసీ దంష్ట్రల్లో చిక్కుకోకుండావుండదు. ఇట్లాంటి కైకల్ని యస్. గోపాలాలు గమనిస్తూవుంటారు. కైకల గతాల్ని వెదికి వెలికి తీస్తూ వుంటారు. ఏమాత్రం వీలున్నా—ఖతం! ప్లాను వేస్తారు. పరోపకారి పాపన్నలు దొంగ వుత్తరాలు రాస్తారు. తెలివుందనుకున్న కైకలు తెలివిగానే ఖెడ్డాల్లో పడతారు. కొన్నిపూలు కేవలం వాసన చూడ్డానికే అనుకుంటారు యస్. గోపాలాలు. కట్నం ఇస్తేమాత్రం ఆ పూలనే హృదయ మందిరంలో అమర్చుకుంటారు. కట్నం ఇవ్వలేమంటే మాత్రం—"సారీ, ఏమనుకోకు—" అని పెంటపోగు మీదికి విసిరి పారేస్తారు—"

ఆవేశంతో చెప్పుకుపోతోంది కైక.

కుర్చీలోంచి ఎప్పుడు లేచిందో లేచింది. నాటకీయంగా వొకవారనుంచి వొకవారకి గదిలో మువ్‌మెంట్స్ తీసుకుంటోంది.

గమ్మున వింటున్నాను—

—"ఎంతోమంది వున్నారిలాంటి కైకలు. అందం వుందనుకుని—కేవలం అందంతోనే మంచి మొగుళ్ళని—అందమైన మొగుళ్ళని కొట్టెయ్యొచ్చుననుకునే అమాయకురాళ్ళు. రోజూ అద్దంలోకి చూసుకోవడం వీళ్ళ కిష్టమేగాని—నిష్కల్మషంగా తమ హృదయాల్లోకి చూసుకోవడం వీళ్ళకి సుతారామూ నయించదు. వీళ్ళంతకి వీళ్ళు తెలుసుకోరు, వీళ్ళ కెవరూ చెప్పలేరు. చెప్పగలిగింది మీలాటి రచయితలే! మీరూ వీళ్ళ గురించి రాయకపోతే ఎలా?—" అంది కైక ఉద్రేకంగా.

"అవును. మీరు చెప్పింది నిజమే! కాని, ఏంచెయ్యడం? అలారాస్తే మా రచనలు అచ్చవ్వు—" అన్నాను బెరుగ్గా.

"ఏం? ఎందుకు అచ్చవ్వు? వొక రాధాగోపీల ప్రణయం గురించి పదహారున్నర పేజీల నాన్సెన్సు రాయండి, అచ్చవుతుంది.

ఇంకో మధుబాల విషాద ప్రేమ గురించి మూడు వారాలకి సరిపడేంత చెత్త పదహారు మెలికలు తిరిగి, ఏదో యాక్సిడెంట్లతో చివరో విశ్వాసం జోడించి రాయండి, అచ్చవుతుంది. వొక నవలంతా ప్రేమలేఖలే రాసినా అచ్చవుతాయి. సంవత్సరంపైగా నడిచే సీరియల్లో మూడువందలా అరవై ముద్దులూ అంతకు కొన్ని ఎక్కువే ద్వంద్వార్థాల డైలాగులూ వుంటాయి, అదీ అచ్చవుతుంది. రాసినంత బూతూ రాసి చివరన కొంచెం ఫిలాసఫీ వెలిగించేస్తే చాలు. తెలుగు నవలల్లో మీరు తీసుకొచ్చిన విప్లవం గురించీ, మీ శైలీరమ్యత గురించీ పాఠకులూ, విమర్శకులూ, మూడోతరగతి రచయిత(త్రు)లూ కూడా కలబడి ఎగబడి మిమ్మల్ని పొగిడేస్తారు. ఆ చెత్తరాతలూ ఆ చెత్త మీద ఈ చెత్తరాతలూ-అన్నీ అచ్చవుతాయి! అంతేగాని, మధ్య తరగతి ఆడపిల్ల కట్నంకోసం ప్రేమనటించిందన్నా, ప్రేమ నటించలేక జీవితంలో దగా పడిందన్నా-వూఁహూఁ-ఈ నిజాలు రాయకూడదా? రాస్తే స్త్రీలే సింపతీ చూపించరా? అందువల్ల వీటిని అచ్చువెయ్యరా? మరయితే స్త్రీలు తమంతట తామూ తెలుసుకోక-మీలాంటివాళ్ళు చెప్పక-ఇంకెలాసార్? ఆడా మగా మధ్య ఆర్థిక కారణాలవల్ల ఈ దోపిడీ ఇలా నిరంతరం జరగాల్సిందేనా? చెప్పండి జవాబు-అలా కిమ్మనకుండా కూచుంటారేం?-"

మాట్లాడి మాట్లాడి రొప్పుతూ నిల్చుంది కైక.

ఏం మాట్లాడాలి? ఏమని జవాబు చెప్పాలి?

ఆలోచిస్తూనే వున్నాను.

నా భంగిమ చూసి ఏమనుకుందో ఏమో-మెత్తబడి దగ్గిరకొచ్చింది కైక. "ఆవేశంగా మాట్లాడుంటే-అయామ్ రియల్లీ వెరీ సారీ-"

గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

కైక వుద్రేకంలా ఎండ పగలబడి కాస్తోంది.

"నే వెళ్తాను-" అంది కైక.

ఎక్కడికని నే నడగలేదు.

"నామీద నవలరాస్తే నేనెంతో సంతోషిస్తాను-"

"ఆలోచిస్తాను-"

"నిజానికి నామీద రాస్తే-ఈ తరం ఆడపిల్లలమీద రాసినట్టు-"

"ప్రయత్నిస్తాను-"

గల్లుమని నవ్వింది కైక. వొచ్చేప్పుడెలా నవ్విందో అలానే

రామాయణంలో కైకదాకా ఎందుకు? కైక కథలోని కైక నా ఎదురుగా వుండంటేనే నమ్మబుద్ధవలేదు. గోపీసుందరంవల్లా యస్. గోపాలంవల్లా మోసపోయిన ఆ కైక-ఈవిడేనా?-

"ప్రయత్నిస్తాను-" అని గొణుక్కుంటూనే వున్నాను.

"ప్రయత్నంలో లోపం వుండకూడదు. ఆపైన సంగతి మీ వంతుకాదు. మరి నే వెళ్తాను. బెస్ లక్!-"

నిష్క్రమించింది కైక.

ఆమె నవ్వు నా గదిలో ఇంకా ప్రతిధ్వనిస్తూనే వుంది. ఆ నవ్వులోని నిగూఢ విషాదం నా మనసుకు గుచ్చుకుంటూనే వుంది.

"ఆడా మగా మధ్య ఆర్థిక కారణాలవల్ల ఈ దోపిడీ ఇలా నిరంతరం జరగాల్సిందేనా?-"

జవాబులేని కైక ప్రశ్న పదే పదే గుర్తుకొస్తోంది......

మధ్యాహ్న భోజనం ముగించేను. వక్కపొడి నములుతూ సిగిరెట్టు తాగుతూ వాలుకుర్చీలో వాలి నా పాత్రల గురించి ఆలోచిస్తున్నాను. అంతలో-

"చంపేస్తాడు బాబో!-నన్ను చంపేస్తాడు-" అని కేక వినిపించింది.

తిరిగి చూసేను.

"నన్నియ్యాల చంపేతాడు-చంపేతాడు" అని నా గదిలోకి సరాసరి పరుగెత్తుకొచ్చేస్తోందొక స్త్రీ.

"ఎవరమ్మా నువ్వు?-"

"బాబుగారూ! మీరే రచ్చించాల!......"-

"అరె ఎందుకలా భయపడుతున్నావు? ఏం జరిగింది?"

"నన్నింక బతకనీడు బాబూ! ఇయ్యాలతే నేనాకరు-వెన్నపేస్తే బయింలేదు-ఈణ్ణికూడా బతకనీడు దొంగ సచ్చినాడు-" చంకలో వున్న మూడేళ్ళ కుర్రాణ్ణి చూపించింది ఆ స్త్రీ.

"చంపుతాడు చంపుతాడంటావ్!-ఎవరు నిన్ను చంపేది?-"

"ఆడే బాబూ-ఆడే-ఆ దొంగ సచ్చినాడే!..."

ఆమె భర్త (నాటుగా చెప్తే-మొగుడు) ఆమెని కొట్టి చంపడానికి సిద్ధమైనట్టూ, ఆమె భయపడుతున్నట్టూ అర్థమైంది.

మేము నీ పాత్రలం అని చెప్పకుంటూ పాత్రలు ప్రవేశి

చొచ్చు. ఆ మాట చెప్పకుండా ప్రవేశించే వాళ్ళుకూడా పాత్రలు కావొచ్చు. "సంపేత్తాడు–ఆడు సంపేత్తాడు–" అంటూ ప్రవేశించిన ఈ స్త్రీ నా పాత్ర కావొచ్చా?

ఆవిడ నాపాత్ర కావడమే కాదు, ఆమెను గురించి రాసే రచయితని నేనవుతానా ?

"మరేం భయంలేదు. ఇక్కడికొచ్చి నిన్నెవరూ చంపలేరు — నీ మొగుడైనాసరే–" అన్నాను అభయమిస్తున్నట్టుగా. ఆలుమగల విషయాలమధ్య జోక్యం కలుగజేసుకోవడం తప్పని నాకు తెలుసు, అయినా–నా కాబోయే పాత్రే కదా అనే మొండిధైర్యంతో ఆమాట అన్నాను-

ఆమాటతో ఆమెకు ఎంతో కొంత ధైర్యం వొచ్చినట్టుంది. "నువ్విట్టా కూసోరా–" అంటూ చంకలోని కుర్రాణ్ణి నా మేజామీద కూలేసింది. వాడిమటుకు వాడు ఆనందంగానే నవ్వుతున్నాడు. "సంపుతాట్ట–సంపుతాడు-ఎట్టా సంపుతాడో సంపనీ–" అంటోంది ఆమె–కిటికీగుండా వెలుపలికి చూస్తూ. ఇంకా గొణుక్కుంటోంది.

అప్పుడే ఆమెను కొంచెం పరీక్షగా చూసేను.

ముప్పై అయిదేళ్ళకి పైనే వుంటాయి. గడకర్రలాంటి శరీరం, రేగిపోయిన పొట్టి పీచుజుత్తు, దుమ్ముకొట్టుకున్న ముఖం, తీర్చి దిద్దినట్టు లేని బండముక్కు, పెదవులు కదిలిస్తే బలహీనమైన పలువరస బైటపడే వికృతపునోరు, గుంటల్లో కళ్ళు, పీక్కుపోయిన దవడలు. ఆ క్షణాన ఆమె అలాగే చచ్చిపోతే ఆశ్చర్యమేం లేదు. అసలు అంత వరకూ ఆమె బ్రతికి వుండడమే ఆశ్చర్యం !

అతి అసహ్యంగావున్న రంగు వెలిసిన పాతచీరలో, ఆమెది కాని రవికెలో–ఆమె ఘోరంగావుంది. ఏదో గొప్ప చిత్రకళా ప్రదర్శనానికి ఎవడో గొప్ప ఆర్టిస్టు అహోరాత్రాలూ శ్రమించి శక్తినంతా వుపయోగించి చిత్రించి పంపిన దారిద్ర్య ప్రతిరూపంలా వుందామె !

మేజామీద నల్లగా తారుముద్దలా కూచున్న ఆమె కొడుకు (కొడుకని తెలుస్తూనేవుంది) ఆమెను ఏమాత్రమూ పోలి లేడు. పెద్దయితే అతను కరుగ్గా వుంటాడని ఎందుకోగాని అనిపిస్తుంది. తల్లి అంత హీనస్థితిలో వుండగా తానుమాత్రం చిద్విలాసంగా నవ్వుతున్నాడు.

"నువ్వుకూడా అటు కూచోమ్మా !–" అన్నాను.

గోడవారన నేలమీద చతికిలపడింది. "ఆడైనా సస్తే బావుండిపోను-నా ప్రేణానికి హాయిగా వుంటుంది — సావడే — ఎదవ సచ్చినోడు–నన్ను సంపుతాట్ట-నన్ను–" ఇంకా గొణుగుతూనేవుంది. తిడుతోంది. పళ్ళు కొరుకుతోంది! మెటికలు విరుస్తోంది!

గమ్మున కూజాలోంచి నీళ్ళు అందించేను. గటగట మని గ్లాసెడూ తాగేసింది, ఇంకో మూడుసార్లు అందించేను, అన్నీతాగి "సాలు బాబూ–" అంది. "వొరేసిట్టీ–నీల్లు తాగుతావ్రటా–" అని అడిగింది కుర్రాణ్ణి.

కిలకిలా నవ్వేడు వాడు. వొద్దన్నట్టుగా రెండు చేతులూ వూపేడు. అడ్డంగా తలకూడా తిప్పేడు.

"ఆడికొద్దులే బాబూ !–" అని చెప్పింది ఆమె నాకు.

సరే–నా పాత్రతో కొంత సంభాషణ జరపడానికి సిద్ధపడ్డాను నేను.

"చూడమ్మా ! నీ పేరేమిటి ?–"

"పేరేదైతేనేం బాబూ–ఈ దరిద్రబ్బతుక్కి–"

"అహ–వూరికినే–తెలుసుకుందామని–"

"పొన్నమ్మ–"

"మీరుంటున్నదెక్కడా ?–"

విస్మయంతో ఆమె నీరసపు కళ్ళుకూడా విచ్చుకున్నాయి.

"మీకు తెలవదేటి బాబూ–మనింటికి నాలుగో ఇంటి యెనకల గుడిసెల్లేవూ ? అణ్ణే మేముండేది–"

నేనుండేది మేడమీది గది. గదివిడిచి యెప్పుడో తప్ప బైట తిరగను. మా నాలుగో ఇంటి వెనకలెక్కడో గుడిసె లుంటాయని తెలుసుగాని–అందులో నిక్కడో పొన్నమ్మ అనే నా పాత్ర వుంటుందని నేనూహించలేదు.

"మీ ఆయన–ఏం చేస్తాడు ?–" అన్నాను.

"ఏటి సెయ్యడంవేంటి బాబూ ?" అంది పొన్నమ్మ.

పొన్నమ్మలాంటి వాళ్ళను ప్రశ్నించడంకూడా రాదు, నేనేం రచయితను ?

"మీ ఆయన–ఏంపని చేస్తాడూ అని ?–"

"ఆడికి యేరే పనేటి బాబూ — పొద్దస్తమానమూ నన్ను తన్నడమే–"

నవ్వు రానీకుండా జాగ్రత్తపడ్డాను. "అదికాదు-పనంటే "

"పనంటే ఇంకేటుందిబాబూ – సచ్చినాడికి రేత్రిప . ల పీరయ్య బడ్డీకాడకెళ్ళి తాగి రావడమే "

తాగడం-పెళ్ళాన్ని తన్నడం-ఈరెండూ పొన్నమ్మ మొగుడు చేసే పనులన్నమాట! మరి పొట్ట గడవడం?

"అది కాదు పొన్నమ్మా! తాగాలంటే డబ్బులు కావాలిగదా—మరి డబ్బు లెక్కణ్ణుంచొస్తాయి నీ మొగుడికి?—"

"డబ్బులికేం? రిచ్చాలాగతాడుగదా — దొంగసచ్చినోడు-" మెటికలు విరిచింది పొన్నమ్మ—"పెళ్లాం ముండ వొండిపెడతానంటే వబ్బీడుగాని — రూపాలకి రూపాలు తగలేసి తాగొస్తాడు — తాగొచ్చి కొణ్ణాం యెట్టమని-రొయ్యపులుసొయ్యమని-తంతాడు. సస్తేపోను—ఏడాపోను—సచ్చినోడు—నా బిడ్డల్తో నేను ముస్టెత్తుకుంటా బతికేత్తాను-" ఆవేశంవల్లా దుఃఖంవల్లా పొన్నమ్మ కళ్ళలో గ్రిరున నీళ్ళు తిరిగేయి. చప్పున లేచి మేజా అంచువెంట ప్రాకుతూన్న కొడుకుని అందుకుని, తన పీల్చుకుపోయిన గుండెలకేసి అదుముకుంది. 'నా బతుక్కి దేవుడు బిడ్డల్నెందు కియ్యాల? ఈల్లు లేకపోతే నేనే రాయిలోనో దూకి సల్లంగా సచ్చిపోదును—"

"ఇంకా వున్నారా పొన్నమ్మా నీకు పిల్లలు?—"

"వుండారు బాబా-వుండారు-ఇంకా ఇద్దరుండారు గుడిసెలో-ఆళ్ళని తంతూంటాడు మాయసచ్చినోడు-మీ యమ్మని పిల్చుకున్నండి-నాకు వొణ్ణమెట్టమనండి-నాకు రొయ్యపులుసొయ్యమనండి-అని బాదేత్తా వుంటాడు-ఎప్పుడు సచ్చిపోతాడో ఆడు-అడి సేతులిరిగిపోనూ—అడికి పెద్దరోగం రానూ-"

పొన్నమ్మమీద ఏమైనా రాయొచ్చా? అని ఆలోచిస్తున్నానేను.

పొన్నమ్మ-పీడిత వర్గానికి చెందిన మనిషి.

పీడిత జనంమీద రాసిన కథలు తెలుగులో చాలా వున్నాయి. కథలూ వున్నాయి, పెద్దకథలూ వున్నాయి. కాని, అట్టడుగు జీవితాల్ని యధాతథంగా చిత్రించిన నవలల్ని వేళ్ళమీద లెక్కించవచ్చునేమో! పొన్నమ్మ జీవితాన్ని ఆధారంగా చేసుకుని నేనొక నవలరాస్తే దానికి మంచి గుర్తింపువచ్చే అవకాశాలు బాగానే వున్నాయి.

తిట్టిన తిట్టే తిడుతోంది మొగుణ్ణి పొన్నమ్మ. అంతలో చిట్టిగాడు ఆకలేస్తోందని కాబోలు—గునిసేడు. "ఆకలేత్తావుందారా? ఏం పెట్టమంటావు నన్ను?—ఛస్—యాడవొద్దు-వూరుకో..." అని కొడుకుని గదమాయించి గుడ్లురిమి వాడు ఏడుపుముఖం పెట్టే పెట్టగానే మళ్ళీ గుండెల కదుముకుంది పొన్నమ్మ.

అల్మైరాలోంచి బిస్కెట్లపొట్లం తీసి పొన్నమ్మ చేతికిచ్చేను. ఇంకో గ్లాసుడు నీళ్ళు కూడా ఇచ్చేను. "తినిపించు పొన్నమ్మా! నువ్వు కూడా తిను—ఇంకా భోంచేసినట్టు కూడా లేదు నువ్వు-"

బిస్కెట్ల పొట్లం మొహమాటం లేకుండా అందుకుంది పొన్నమ్మ—"లేదు బాబా-వణ్ణం యింకా తిన్లేదు. తిండఃవేటి—ఈ పూటసలు వొండనేలేదు-"

"అదేం?—"

"రేత్రాడికి సెకండ్ సో బేరాలు బాగానే వొచ్చేయి బాబా! తెల్లారిపోతుండగా గుడిసికొచ్చి తొంగున్నాడు. తెల్లారితే ఆడిదగ్గిర డబ్బులు నిలవ్వని నాకు తెలుసు. అందుకని-రిచ్చాడబ్బులు ఇచ్చెయ్యిరా—అన్నాను. పొద్దున్నే ఇత్తాన్లేయే — సత్తెప్రెమానకంగా ఇత్తాను-అన్నాడాడు. నిద్దట్లో వుంటా డిప్పు డెందుకులే-పొద్దున్నే నిజ్జంగా ఇతాడనుకున్నాను, పొద్దున్నే లేసి సూసేకాడికి ఆడిపక్క కాలీగుంది. అప్పటికే పరారైపోయేడాడు......"

"పరారీయా?—అంటే?......"

"పీరయ్య కొట్టుకాడికి బాబా...పొద్దున్నే ముకం కూడా కడుక్కోకుండా—పెలా మ్ముకం కూడా సూడకుండా—సారా కొట్టు

ఆంధ్ర సచిత్ర వార పత్రిక

— చందా వివరాలు —

విడి ప్రతి వెల ... 0-75 పైసలు

	మ్యాన్ ఏజంటుద్వారా		పోస్టుద్వారా	
	రు.	పై.	రు.	పై.
సంవత్సర చందా	39-00		41-60	
అర్థ సంవత్సరం	19-50		20-80	
మూడు మాసములకు	9-75		10-40	

మేనేజరు
ఆంధ్రపత్రిక

కెళ్తాడాడు. ఆ యెల్లడం యెల్లడం మద్దినాల కొచ్చి-కూడెటే నంజా—రొయ్యపులుసొయ్యే నంజా-అని నన్ను కొప్పట్టుకొక్కడతాడు...ఈడ్చీడ్చి తంతాడు...వొద్దురా బగమంతుడా-ఈ బతుకొద్దు......"

ఏడ్చేందుక్కూడా శక్తిలేదు పొన్నమ్మకి.

మొగుడిచేత తన్నులు తినడానికి మాత్రం యెక్కణ్ణుంచొస్తుంది శక్తి ?!

"నీకు అయిన వాళ్ళెవరూ లేరా పొన్నమ్మా?—" అని అడిగేను.

ముక్కు చీదుకుంది పొన్నమ్మ. ఏదో చెప్పబోయింది. అంతలో ఇంకేదో గుర్తుకొచ్చినట్టు—వొక్కసారిగా గొల్లుమంది. "నా కెవరుండారు తండ్రీ!-ఎవురూలేరు-ఎవురూలేరు—వుంటే నేనిట్టా యెందుకుంటాను? నా కెవురూలేరెవురూ లేరు—" ఏడుస్తూ రాగాలు తీస్తోంది.

బిక్కపోయి చూడడం మినహాయించి నేనేం చెయ్యగలను?

కదిలించడమే తప్పయింది.

కదిలించేసరికి ఆమె కన్నీళ్ళుగా కరిగిపోయింది.

"ఏడవకు పొన్నమ్మా!...అదృ!—చూడు—నీ కొడుకు జడుసుకుంటున్నాడు—"

నిజంగానే చిట్టిగాడు కూడా ఏడుపుముఖం పెట్టేడు.

అతిప్రయత్నంమీద ఏడుపుని నిగ్రహించుకుంది పొన్నమ్మ.

"నేను నిన్ను ఇంకేమీ అడగనులే పొన్నమ్మా!...నువ్వు అనవసరంగా బాధపడకు—" అన్నాను.

ఆ మాటతో పొన్నమ్మలో నామీద కొంత ఆత్మీయతాభావం కలిగినట్టుంది—"అదేనిటి బాబూ!...అట్టాగంటారూ?—" అంది.

ఎందుకొచ్చిందోగాని పొన్నమ్మకు సడెన్‌గా వొక అనుమానం వొచ్చింది—"ఇంతకూ మీరేటిబాబూ—సేసేది—ఆపీసరుద్యోగమా?—"

"కాదు-పొన్నమ్మా!...నేనొక రచయితను—"

"అంటే-ఆపీసు కెళ్తావు గదా బాబూ?—"

రచయితకి ప్రపంచమే ఆఫీసు.

పొన్నమ్మకెలా చెప్పను ?

"రచయిత-అంటే కథలూ, నవలలూ రాస్తాను పొన్నమ్మా-"

"అప్పుపత్రాలు రాసినట్టేనా బాబూ!-రాయడమంటే?-" నరిపోయింది.

పొన్నమ్మ విచిత్రమైన పాత్రే!

రచయితంటేనే తెలీని పాత్ర !

"అప్పుపత్రాలు కాదు పొన్నమ్మా !-కథలు—" (నవల-అనే గొప్పమాట ఆమెముందు ప్రయోగించి లాభంలేదు!) "కథలు తెలీదూ నీకు?-బజార్లో ప్రేళ్ళాడదీస్తారే-బొమ్మల పుస్తకాలు—అందులో వుంటాయి-అట్లాంటివి రాస్తున్నేను—"

"కతలు-యేరే రాయడమెందుకు బాబో?-సెప్తే పోలా?—"

తెలివైన ప్రశ్నలు కూడా (!) వేస్తోంది పొన్నమ్మ. తెలివైన ప్రశ్నలు అడిగించుకోవడం సులువే. కాని, వాటికి జవాబులు చెప్పి వొప్పించే తెలివి వుండకపోతే?—

—"వూళ్ళో వొక్కొక్కర్నీ పిల్చి కథ చెప్పడమంటే కష్టం కదూ పొన్నమ్మా—పుస్తకాల్లో కథలు రాసేస్తే—ఎవరికి వాళ్ళే చదువుకుంటారు—"

ఈ వివరణ ఆమెకి నచ్చినట్టు లేదు. కథలు—చెప్పగా వినాలే గాని, రాయకూడదని ఆమె అభిప్రాయమేమో!

"పోనీ! నీమీద కథ రాయమంటావా పొన్నమ్మా!—" అన్నాను వ్యవహారం నాన్చడం ఇష్టంలేక.

పొన్నమ్మ కళ్ళు విస్మయంతో విచ్చుకున్నాయి.

"నామీదా-కతా?—యేటిబాబూ-పరాచికాలు—నేనేం సీతమ్మోరినా? వూరిమిలమ్మనా? దరౌపతినా?—" అంది.

పొన్నమ్మతో వాదోపవాదాలకి దిగితే నేనెక్కడ తేలుతాను ?

"కథలు (నవలలని లాభంలేదు) ఎవరి మీదైనా రాయొచ్చులే పొన్నమ్మా—సినిమాల్లో ఎప్పుడూ చూళ్ళేదూ నువ్వు ?......"

"నేను సినిమాలెక్కడ సూస్తాను బాబూ ... ... బిడ్డలకి కూడెట్టడానికే లేదు... ..."

మళ్ళీ-ఏడుపు లంకించుకుంటుందేమోనని భయం వేసింది.

"అన్నట్టు-ఈవూరేనా పొన్నమ్మామీది ? లేకపోతే—నువ్వూ నీ మొగుడూ ఇంకెక్కణ్ణుంచన్నా వొచ్చి యిక్కడ జేరేరా ?—" అన్నాను మాట మారుస్తూ-అలా అయినా పొన్నమ్మ తన కథ చెబుతుందేమోననే భావనతో.

నా అంచనా తప్పకాదు. పొన్నమ్మ తన కథ చెప్పింది. నిజానికది కథకాదు. సాదా జీవితం. అందులో మలుపుల్లేవు, థ్రిల్స్ లేవు. వొళ్ళు గగుర్పొడిచే సన్నివేశాల్లేవు.

పల్లెటూరి మనిషే పొన్నమ్మ. తల్లి పురుట్లో పోయింది. తండ్రి రెండో పెళ్ళి చేసుకున్నాడు. ఆమె అమ్మవారుపోసి చచ్చిపోయింది. పొన్నమ్మకి పదమూడేళ్ళొచ్చినప్పుడు ఆమె తండ్రి ముచ్చటగా మూడోసారి పెళ్ళిచేసుకున్నాడు. ఈ లేటెస్టు పింతల్లి పొన్నమ్మను రాచి రంపాన పెట్టి, మొగుణ్ణి కొట్టి మొగసాలకెక్కి వొక మంచిరోజు చూసి ఎవరితోనో లేచిపోయింది. ఎటుపోయిందోగాని అటు తర్వాత ఆమె జాడలేదు. పొన్నమ్మ తండ్రికి పక్షవాతం వచ్చింది. పొలం పనిక్కూడా వెళ్ళలేకపోయేడు. కూలిడబ్బులు తెచ్చుకునే మార్గంలేదు. ఇంట్లో కూతురు జూస్తే పెద్దమనిషై కూచుంది.

ప్రక్క పల్లెలో హుషారైన కుర్రాడొకడుండేవాడు. వాడూ కూలిపని వాడే. అయితేనేం ? రోజనస్తమానం రాజులా తిరిగేవాడు. వాడో దినం పొన్నమ్మని మొగిలి పొదల దగ్గిర చూసి మనసుపడ్డాడు. పొన్నమ్మ తండ్రితో మాట్లాడేడు. "పిల్లనిస్తావా - లేపోతే నన్ను పుచ్చేసుకుని సావమంటావా ?–" అని అడిగి, ముసిలాడి చేత "సరే ఇస్తాను" అనిపించుకుని, ఇప్పించుకుని, పెళ్ళాంతో–మామగారితో– ఈ బస్తీలో కొత్తకాపరం పెట్టేడు.

"అప్పుడాడు దేవుళ్ళాంటోడు బాబూ – తాగేవోడు కాదు, నన్ను తన్నేవోడు కాదు. ఆకరికి బీడీ ముక్కకూడా ముట్టించేవోడు కాదు. నన్ను యెప్పుడూ "పొన్నా–యేయ్ పొన్నా-" అని పిలుస్తూ యెంతో యిదిగా సూసుకునేవోడు-"

అలనాటి తొలి సుఖాలు తలపుకొచ్చి పొన్నమ్మకళ్ళు చెమ్మగిల్లేయి. ఆమె గొంతు బొంగురుపోయింది. ఆమె మళ్ళీ ఇలా చెప్పింది–

"మొదట మొదట అన్నీ యిబ్బందులే బాబూ! కూసిని దినాలు హోటల్లో కప్పులు కడిగేవోడు. కూసిని దినాలు లారీలకాడ మూటలు మోసేవోడు. ఆకరికి అద్దికి రిక్షా తీసుకుని తొక్కడం మొదలెట్టేడాడు. నేనుకూడా ఏదన్నా పని సేసుకుంటానంటే– సెయ్యనిచ్చేవోడు కాదు. రేత్తిరీ పొగులూ రిక్షా లాగిలాగి ఆకరికి రిక్షా కొనేసినాడు. అప్పుడెంతో సుకంగా వుండేవాళ్ళం బాబూ! మా అయ్యకూడా మాతోటే వుండేవాడు... ..."

"అయితే నీ మొగుడికల్లాంటి విపరీతపుబుద్ధులెందుకు పుట్టేయి ? మీకసలు దెబ్బలాట లెలా ప్రారంభమయ్యేయి ?–"

"ఎట్టాగంటే ఏం సెప్పడం బాబూ ! పోకిరీ సావాసాలు– పోకిరీసావాసాలుసేసి సెడిపోయినాడు బాబూ ఆడు–మెల్లింగ మెల్లింగ సారాయి తాగడం మొదలెట్టేసినాడు – ఆ మహమ్మారి పాలబడితే మళ్లీ లేవడం యెక్కడ ?- అంతేబాబూ- ఆడు పొర్తీ పట్టలేనట్టుగా మారిపోయినాడు–రోజూ తాగొచ్చేసేవాడు, నన్ను తన్నేవోడు. మా అయ్యొచ్చి అడ్డం పడితె – అయ్యనికూడా తన్నేసేవోడు...వొకసారి మాటామాటాపెరిగి రగడ పెద్దదైపోయి – "కూతురింటకొచ్చి కూసుండి తిండానికి సిగ్గు లేదంట్రా దొంగనా కొడకా-" అని మా అయ్యని మెడబట్టి గుడిసిలోంచి గెంటి తలుపేసేసినాడు ఆడు. నేనెంత అరిచి మొత్తుకున్నా కూడా యినిపించుకోలేదు. మా అయ్య అసలే రోషమ్మనిషి. అవుమానం బరించనే బరించలేదు. అంత రేత్రేల – అంత సలిలో – యెట్టా యెక్కడికి యెల్లిపోయినాడో– యెల్లిపోయినాడు-బలే రోసమ్మనిషి- మా అయ్య ... ...

వెక్కి వెక్కి ఏడుస్తోంది పొన్నమ్మ. తండ్రి గుర్తు కొచ్చేసరికి ఆమె ఆవేశం మరీ అదుపులేకుండా వుబికింది.

"పోస్ట్ !–" అని కేక.

తలుపు తీసేను

వొక బరువైన పార్శిల్ అందించి వెళ్ళిపోయేడు తపాలా బంట్రోతు.

ఏడుపునుంచి కొంత కొంతగా వూరడిల్లుతోంది పొన్నమ్మ. నేనామెను సముదాయించే ప్రయత్నం చెయ్యలేదు. ఏడవొద్దంటే మరీ ఎక్కువేడుస్తారు ఆడవాళ్ళు !

పార్శిల్ మీద దస్తూరీ కొత్తగావుంది.

ఫ్రం అడ్రెస్ దగ్గర 'చంద్రకాంత్' అని మాత్రం రాసుంది.

ఎవరీ చంద్రకాంత్ ?

ఎంత ప్రయత్నించినా గుర్తు రాలేదు.

నా పరిచయస్థుల్లో చంద్రకాంత్ అని పేరు గలవాళ్ళెవ్వరూ లేరు.

అది నాకొచ్చిన పార్శిలేనా – తపాలా బంట్రోతు పొరబాటు పడలేదు గద-అనుకుంటూ 'టు' అడ్రెస్ పరీక్షగా చూసేను.

"శ్రీ కె. ఆనందరావు
రచయిత"

"రచయిత" అని మరీ అంత రమ్యంగా రాసివుంటే పార్శిల్ నాది కాదనుకోవడం ఎలా ? రచయిత-అని అడ్రెస్‌లో రాసిన ఈ

చంద్ర కాంతుడెవరోగాని - నా మెదడుకి పని పెట్టడానికే కంకణం కట్టుకున్న పాఠకుడని-ఎందుకో అనిపించింది.

పార్శిల్లో ఏమున్నట్టింతకీ ?

విప్పి చూడబోతుండగా-అంతలో-

"అయితే మరినే నెల్తా బాబూ - మీకెన్నో పన్లుంటాయి-" అంది పొన్నమ్మ.

పొన్నమ్మమీద నవల రాసే వూహ నన్నింకా వొదల్లేదు.

అంతలో పొన్నమ్మనెలా వొదుల్తాన్నేను ?

పార్శిల్ టేబిల్‌మీద పెట్టి - మళ్ళీ పొన్నమ్మకథ వింటానికి సిద్ధమయ్యేను. "ఆఁ-చెప్పు పొన్నమ్మా-అ తరువాత మీనాన్న మళ్ళీ ఎప్పుడూ కనిపించలేదా ?-"

ఏడుపు తేటపడిన కళ్ళని కొంగుతో వొత్తుకుని - మిగత కథంతా చెప్పింది పొన్నమ్మ.

కనిపించకేం ? పొన్నమ్మతండ్రి మళ్ళీ కనిపించేడు. కాని, వొకేసారి. అదే ఆఖరుసారి. వొకానొక సాయంత్రంపూట పొయ్యూదుతూ పొన్నమ్మ వంట ప్రయత్నంలో వుండగా వాకిట్లోంచి "నా సిట్టితల్లీ పొన్నమ్మా !..." అని పిలుపు వినిపించిందిట. వెయ్యి జన్మలకైనా గుర్తుండే పిలుపు అది. గుమ్మంలోంచి దూసుకునొచ్చి తండ్రిని కావలించుకుని వలవలా ఏడ్చేసిందిట పొన్నమ్మ. "యిన్నాళ్ళేడున్నావురో అయ్యా-యేఁవైపోయినావు-" అని రాగాలు తీసింది.

కూతురి ప్రశ్నలకి జవాబేమీ చెప్పకుండా నిశ్శబ్దంగా నవ్వేట్ట ముసిలాడు-"ఆకలేస్తాంది - బువ్వొండి పెడతావా - నాసిట్టితల్లీ పొన్నమ్మా-" అన్నాట్ట. సంబరంగా లోపలికెళ్ళి వంటచెయ్యడం సాగించింది పొన్నమ్మ. అక్కణ్ణుంచే ఆమె చెప్పే కబుర్లకి వూఁకొడుతున్నాడు ముసిలాడు. కాని, కొంత సేపటికి పొన్నమ్మ మొగుడు గుడిసెకి తిరిగొచ్చి-పొన్నమ్మ వల్ల వచ్చిందెవరో తెలుసుకుని - ముసిలాడంటే మునుపటి కోపం పోయిందిగనక - "లే-ముసిలోడా-బువ్వతిని వూసులాడుకుందాం లే-" అని లేవగొడితే - ఎంతకీ లేవలేదట ముసిలాడు. ఇంకెక్కడ లేస్తాడు? ఎలా లేస్తాడు? కూతురి మాటలకి వూఁకొడుతూ వూఁకొడుతూ-ఎలా జారుకున్నాడో, ఎప్పుడు జారుకున్నాడో-ఈలోకంనుంచే నిష్క్రమించేడు... ... ...

"యెతుక్కుంటూ యెతుక్కుంటూవొచ్చి నా వాకిట్లోనే సచ్చిపోయినాడు బాబూ-మా అయ్య!...వణ్ణం వొండమన్నాడు గాని-తినే తిన్లేదు... యెల్లి పోయినాడు మా అయ్య ... 'నా సిట్టితల్లీ పొన్నమ్మా !-'అని కడసారికూడా పిల్సి అట్టానే యెల్లిపోయినాడు... యెతుక్కుంటూ నన్ను సూత్తాని కొచ్చినాడేగాని గుడిసిలోకి అడుగే యెట్టలేదు మా అయ్య...బలే రోసం మనిషి మా అయ్య ... ..."

"అయితే-పొన్నమ్మా !-నీ మొగుణ్ణిహ బాగుచేసే మార్గమే లేదా ?-నీ మొగుడు ఆ పాడు తాగుడు మానేస్తే బాగుపడతాడనుకుంటాను-"

కెరటంలా నవ్వింది పొన్నమ్మ, చీకటి కెరటంలా.

"ఆడూ బాగుపడ్డు-ఆడివల్ల నేనూ సుకపణ్ణు ... నావల్ల నా బిడ్డలూ బాగుపడరు...ఈ బ్రతుకు లిట్టా యెల్లమారాల్సిందే బాబూ ... ..."

"సరీగ్గా నడుచుకోవాలేగాని-మీ బ్రతుక్కేం పొన్నమ్మా!..."

"మీకు తెలవదుబాబూ !...మా బతుకు లింతే...మా బతుకు లింతే... ..."

గడియారం వరసగా ఆరుగంటలు కొట్టింది.

"గంటెంత బాబూ !..." అంది పొన్నమ్మ.

"ఆరయింది"-

"అయ్యబాబోయ్..." అంటూ లేచింది పొన్నమ్మ-"అయితే నేనెలిపోతాను బాబూ..."

"ఎక్కడికి ?"

"గుడిసికి-"

"ఎలా వెళ్తావ్ ? - నీ మొగుడు కైపులో..."

గల్లున నవ్వింది పొన్నమ్మ ... అంత స్వచ్ఛంగా ఆమె నవ్వుతుందని నాకు తెలీదు.

-"మరి నీ మొగుడు నిన్ను చంపేస్తాడని కదా-భయపడి ఇక్కడ దాక్కున్నావ్...ఇప్పుడేమీ అనడూ?-నిన్ను తన్నడూ?-"

నవ్వు కొనసాగించింది పొన్నమ్మ.-"తాగినప్పుడు తంతాడుగాని, మిగతాప్పుడు ఆడు దేవుడు బాబూ!...... సంపేత్తానంటాడు గాని నిజ్జంగా సంపుతాడేటి?-యెర్రిదాన్నయి పారొచ్చి దాక్కున్నానుగాని మొగుడుసేతిలో సచ్చిపోటం కన్నా ఆడముండ కింకేం కావాల బాబూ... వొరే సిట్టీ-దా-పోదాం దా-బాబుగారికి దండఁవెట్టురా-దండఁవెట్టు, అట్టా మిటకరిచ్చి సూత్తావేం? ... ... బిసకత్తులిత్తే మాత్రం తింటావా?...యెల్లొత్తాం బాబూ..."

చిట్టితో గుమ్మం దగ్గిర కెళ్ళింది పొన్నమ్మ.

"పొన్నమ్మా నీమీద కథ రాయమంటావా-వొద్దా?"-

ఆగి తేరిపార జూసింది పొన్నమ్మ.

"నామీద-కతేంటి బాబూ?..."

"నీ బ్రతుకుమీద..."

"మా అందరి బతుకులూ వొకటే బాబూ-ఆటిలో యింతే ముంది? ఆఁ - సరీగ్గా గ్యాపకానికొచ్చింది-సిలీఁవా అన్నావు గదా బాబూ...ఎప్పుడో ఆరేళ్ళకిముందు-ఆడికొక సాయింత్రం దేవకళా బుద్ధిపుట్టి నన్ను సిలీఁవాకి అట్టుకెలి నాడు బాబూ...ఆ సిలీఁవా నా కిప్పుడు గ్యాపకానికొస్తావుంది... పంట్లాలేసుకునే పాసన్ ఆడ పిల్లలూ, కాలేజి పేఁవలూ...ఆ సిలీఁవా అంతా అవ్వే బాబూ... ఆఁ-ఆడా మొగా జట్లు జట్లుగా తోటల దెగ్గిరా, యేటొడ్డునా జమాయించి పాడుతూ డ్యాన్సులు చేస్తారు బాబూ...ఇగో-రాస్తే-ఆ మాదిరి కతలు రాయి...అట్టాంటి పంట్లాలేసుకునే ఆడపిల్లల మీద కతలు రాయి...అంతేగాని...మా అసుమంటోల్లమీద కతలు రాస్తే మీకేటొత్తాది బాబూ...మీ మాదిరి గొప్పోల్లు కతల రాయడానికి యెర్రిపొన్నమ్మ - పొన్నమ్మ బతుకు - యేం పనికొస్తాది బాబూ!..."

పొన్నమ్మ అపాటి లెక్చెరిస్తుందని కూడా అంతవరకూ తెలీదు నాకు. అవాక్కయి చూస్తున్నాను.

"యేం సిట్టీ-పోదామా? పోదాం! . వొత్తాం బాబూ!... మజ్జానం కూడా వొండలేదు......ఆకిలొత్తే కల్లు తిరిగి అట్టే తొంగు నుంటాడాడు...పొద్దుగూకిపోయింది...యెల్లి ఆడికి తానానికి యేణ్ణీల్లెట్టాల......"

చంకలో చిట్టిగాణ్ణి ఎగేసుకుంటూ గదిలోంచి నిష్క్రమించి మునిమాపు చీకట్లో కలిసిపోయింది పొన్నమ్మ.

వొక్క నిమిషం అలాగే నిలబడ్డాను.

అప్రయత్నంగానే నిట్టూర్చేను.

పొన్నమ్మను గురించిన ఆలోచనలు వొదలడంలేదు.

పొన్నమ్మ నా పాత్రే!

కాని, ఆమె మీద నేనేమైనా రాయగలనో లేదో ఇంకా తెలీదు.

రాయగలిగితే బాగుణ్నని బలంగా వుంది. కాని, ఎలా? ఎలా?

టీ తెప్పించుకుని (!) తాగేను.

మెదడు కొంచెం తేటపడింది.

సిగిరెట్టు వెలిగించి రెండు దమ్ములు పీల్చి టేబిల్ మీదికి చూసి-"అరె!-" అనుకున్నాను.

పార్శిలు!

పొన్నమ్మతో నేను మాట్లాడుతూండగా వొచ్చిన పార్శిలు!

"అరె! దీని సంగతే మర్చిపోయేన్నేను-" అనుకుంటూ పార్శిల్ని చేతిలోకి తీసుకున్నాను. విప్పేను.

(ఇంకా వుంది)

ఆంధ్రుల అభిమాన దిన పత్రిక

ఆంధ్రపత్రిక

ఇప్పుడు ఎన్నో సరికొత్త శీర్షికలతో వెలువడుతోంది.

విడి ప్రతి వెల 30 పైసలు

........................చందా వివరాలు........................

సంవత్సరమునకు	ఏజెంటు ద్వారా	రు. 108-00	పోస్టుద్వారా	రు. 115-20
ఆరు మాసములకు	,,	రు. 54-00	,,	రు. 57-60
3 మాసములకు	,,	రు. 27-00	,,	రు. 28-80
1 మాసమునకు	,,	రు. 9-00	,,	రు. 9-60